# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలలో పర్యటిస్తున్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది.**
4. **తల్లి పాల వలన కలిగే ప్రయోజనాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.**
5. **సాగునీటి రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

=========================

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు 6:1 మెజారిటీతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. తాజా తీర్పును అనుసరించి ప్రభుత్వాలు ఉపవర్గీకరణపై తదుపరి మార్గదర్శకాలు రూపొందిచుకోవాలని సూచించింది. వెనుక బడిన వర్గాల వారికి మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు రిజర్వ్‌డ్ విభాగంలో రాష్ట్రాలు ఉపవర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు వెల్లడించింది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలలో పర్యటిస్తున్నారు. ఈ ఉదయం ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరి నంద్యాల జిల్లాలోని శ్రీశైలానికి చేరుకుని.. భ్రమరాంభ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైలం ప్రాజెక్టును ముఖ్యమంత్రి సందర్శించి కృష్ణా నది జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించి సున్నిపెంట వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహిస్తున్నారు. ఇలా ఉండగా.. ఈ మధ్యాహ్నం ముఖ్యమంత్రి శ్రీ సత్యసాయి జిల్లాళక్ష పర్యటిస్తారు. పింఛన్ల

పంపిణీలో భాగంగా జిల్లాలోని మడకశిర మండలం గుండుమల గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి ముఖ్యమంత్రి నగదును అందజేస్తారు. అనంతరం గ్రామంలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది. ఇందులో భాగంగా ఈరోజు పలువురు మంత్రులు, శాసన సభ్యులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదును అందజేస్తున్నారు. రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లతో కలిసి తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలోని రామవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంమైన నెల్లూరు 48వ డివిజన్ పొర్లుకట్ట ప్రాంతంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పింఛన్లు అందజేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని చెప్పారు.

సామాజిక భద్రతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తామన్నారు. వృద్ధులకు 4 వేలు, దివ్యాంగులకు 6 వేల రూపాయలను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో ఈరోజు నుంచి ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రచార పత్రాన్ని అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది "అంతరాలు లేకుండా అందరికీ తల్లిపాల మద్దతు" అనే ఇతివృత్తంతో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోషకాహార లోపానికి వ్యతిరేకంగా పిల్లలలో మెదడు అభివృద్ధిని పెంచడానికి ఏడాది వయస్సు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు తల్లిపాల పోషణ అవసరమని తెలిపారు.

---------------------------

తల్లి పాలు అమృతంతో సమానమని, ప్రతి ఒక్కరూ తల్లి పాల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా ఈ రోజు శ్రీసత్య సాయి జిల్లా ధర్మవరం సాయి నగర్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వారోత్సవాల కరపత్రాలని మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిశువుకు తల్లిపాలు మంచి పౌష్టికాహారమని... ఎంతో సురక్షితమైనవని తెలిపారు.

-------------------------

సాగునీటి రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈరోజు శ్రీశైలం జలాశయాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంపై ప్రత్యేక దృష్టి సారించి, దాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలుపుతూ...

..వాయిస్...23 సెకన్లు

-------------------------

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేసింది. 1.29 లక్షల కోట్ల రూపాయల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. 4 నెలల కాలానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ గవర్నర్ అబ్దుల్ నజీర్ జారీ చేశారు. 40 ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన అంశాలతో నవంబర్ 30వ తేదీ వరకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇలా ఉండగా కూటమి ప్రభుత్వం సెప్టెంబరులో పూర్తి రాష్ట్ర స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగంలో ఈరోజు నుండి రాత్రి 8 గంటల 30 నిమిషాలకు 'జాతీయ వార్తలు' పేరిట కొత్త న్యూస్ బులెటిన్ ప్రారంభం అవుతోందని ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి తెలిపారు. ఈ న్యూస్ బులెటిన్ ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగంలో రెండవదిగా పేర్కొన్నారు. ఈ బులెటిన్ రాత్రి ఎనిమిదిన్నర గంటల నుండి ఎనిమిది గంటల నలభై నిముషాల వరకూ ప్రతీ రోజూ ప్రసారం అవుతుందని తెలిపారు. ఇక సాయంత్రం ఆరు గంటల పది నిముషాల నుండి ఆరు గంటల ఇరవై నిముషాల వరకు ప్రసారమయ్యే ప్రాంతీయ వార్తలు యధాతథంగా కొనసాగుతాయని వివరించారు. ఆకాశవాణి శ్రోతలు కొత్త న్యూస్ బులెటిన్‌ని కూడా ఆదరించాలని శ్రీసాయి వెంపాటి కోరారు.

-------------------------

పర్యావరణ పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయటం ద్వారా భావితరాలకు అందించే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు గుంటూరు జిల్లాలో ప్రజలు స్వచ్ఛందంగా ఏక్ పేడ్ మా కే నామ్ తల్లిపేరిట ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ముఖ్యంగా విద్యార్థులు తల్లి పేరుతో మొక్క నాటడం ఎంతో స్ఫూర్తివంతంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం పర్యావరణంపై అవగహన కల్పించేందుకు దోహపడుతుందని గుంటూరుకు చెందిన విద్యార్థి శశికాంత్ ఆకాశవాణికి తెలుపుతూ,

వాయిస్ (25 సెకన్లు )

-------------------------

రాష్ట్రంలోని దేవాలయాలకు నూతన పాలకవర్గాలను నియమిస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో నిన్న మాట్లాడుతూ, దేవాదాయశాఖలో రిజిస్ట్రేషన్ అయిన 5,400 ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు 5వేలు రూపాయలు

ఇస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 10వేల రూపాయాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. 50వేల లోపు ఆదాయం ఉన్న దేవాలయాల్లో అర్చకులకు ఇకపై 15వేలు ఇస్తామని తెలిపారు.

---------------------------

స్వాతంత్ర్యోద్యమ కాలంలో తన ప్రసంగాలతో యువతలో స్ఫూర్తి రగిలించిన లోక మాన్య బాల గంగాధర తిలక్ వర్ధంతి ఈ రోజు. 1856 సంవత్సరం జులై 23వ తేదీన బొంబాయి సమీపంలోని రత్నగిరి పట్టణంలో జన్మించిన ఆయన... స్వరాజ్య సాధన దిశగా ప్రజలను ముందుకు నడిపించారు. "స్వరాజ్యం నా జన్మ హక్కు" అని నినదించి... దానిని ఎప్పటికైనా సాధించి తీరుతామంటూ స్వాతంత్ర్యోద్య మాన్ని కొత్త పుంతలు తొక్కించారు. సంపూర్ణ స్వరాజ్యోద్యమానికి పితామహుడిగా నిలిచిన బాల గంగాధర తిలక్ 1920వ సంవత్సరం ఆగస్టు 1వ తేదీన తుది శ్వాస విడిచారు.

=======================